పెండింగ్ బిల్లులు వెంటనే
విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 2 : పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ రంగారెడ్డి కలెక్టర్ శశాంకను కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పనులు చేపట్టి నేటికీ బిల్లులు రాక పెండింగ్‌లో ఉన్నందున ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

కడ్తాల్ పీఎస్ తనిఖీ

కడ్తాల్, ఫిబ్రవరి 2 : కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎస్‌లోని రికార్డులను పరిశీలించి, నమోదవుతున్న కేసుల వివరాలు, సిబ్బంది సంఖ్య, విధులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు అంకిత భావంతో పని చేయాలని.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలని.. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, ఏఎస్ఐలు నిరంజన్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే
కఠిన చర్యలు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 2 : ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ -పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సురేశ్‌బాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తాం
బాధ్యతలు స్వీకరించిన అధికారులు

మంచాల :ఆరుట్లలో ప్రత్యేక అధికారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్ : కడ్తాల్ పంచాయతీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

మంచాల, ఫిబ్రవరి 2: గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం గురువారంతో ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. మంచాల మండలం 23గ్రామ పంచాయతీలకు శుక్రవారం అధికారులు బాధ్యతలు తీసుకున్నారు. మండల పరిధిలోని లోయపల్లి, ఆరుట్ల, మంచాల మేజర్ గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, ఈవోఆర్డీ తేజ్‌సింగ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ప్రత్యేక అధికారులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఆరుట్లలో ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చీరాల రమేశ్, కావలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని ప్రత్యేకాధికారులను గ్రామాల వారీగా శుక్రవారం నియమించారు. యాచారం, చౌదర్‌పల్లి ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో విజయలక్ష్మి, మాల్, నల్లవెల్లి ప్రత్యేకాధికారిగా ఎంపీవో ఉమారాణి, మేడిపల్లి, మల్కీజ్‌గూడ ప్రత్యేకాధికారిగా మిషన్ భగీరథ డీఈ రాజు, నందివనపర్తి, అయ్యవారిగూడ ప్రత్యేకాధికారిగా పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, గున్‌గల్, గడ్డమల్లయ్యగూడ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, చింతపట్ల, మొండిగౌరెల్లి ప్రత్యేకాధికారిగా అగ్రికల్చర్ ఆఫీసర్ సందీప్‌కుమార్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి ప్రత్యేకాధికారిగా మిషన్‌భగీరథ ఏఈ రజిత, కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం ప్రత్యేకాధికారిగా ఇరిగేషన్ ఏఈ జయలక్ష్మి, మంథన్‌గౌరెల్లి, కేసీతండా ప్రత్యేకాధికారిగా పంచాయతీరాజ్ ఏఈ ఉస్మాన్, తాటిపర్తి, నానక్‌నగర్ ప్రత్యేకాధికారిగా ఇరిగేషన్ ఏఈ సునీత, తులేఖుర్దు, ధర్మన్నగూడ ప్రత్యేకాధికారిగా ఉప తహసీల్దార్ కీర్తిసాగర్, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లితండా ప్రత్యేకాధికారిగా ఇరిగేషన్ డీఈ మంజులదేవీ విధులు నిర్వహించనున్నారు.

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకారం

కడ్తాల్ : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిందని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మండల పరి ధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో రామకృష్ణ, ముద్విన్‌కు తహసీల్దార్ షేక్ ముంతాజ్, రావిచేడ్‌కు ఎంపీవో మధుసూదనాచారి, మైసిగండి గ్రామానికి మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత, అన్మాస్‌పల్లి, గాన్గుమార్లతండాకు మిషన్ భగీరథ డీఈఈ సందీప్‌కుమార్, గడ్డమీదితండా, పెద్దవేములోనిబావితండాకు మండల పశువైద్యాధికారి భానునాయక్, కర్కల్‌పహాడ్, నార్లకుంటతండాకు పంచాయతీరాజ్ ఏఈ పరమేశ్, గోవిందాయిపల్లితండా, గోవిం దాయిపల్లికి ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి, వాసుదేవ్‌పూర్, బాలాజీనగర్‌తండాకు ఆర్ అండ్ బీ ఏఈ రవితేజ, చరికొండ, పల్లెచెల్కతండాకు ఇరిగేషన్ ఏఈ నిఖిల, ఏక్వాయిపల్లి, మర్రిపల్లికి మిషన్ భగీరథ ఏఈ శ్రావ్య, సాలార్‌పూర్, చల్లంపల్లికి నాయబ్ తహసీల్దార్ వినోద్‌కుమార్, మక్తమాదారం, రేఖ్యాతండాకు మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సురేశ్‌నాయక్, న్యామతాపూర్, కొండ్రిగానిబోడ్‌తండాకు పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించినట్లు ఎం పీడీవో రామకృష్ణ తెలిపారు. కడ్తాల్ పంచాయతీలో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారి ఎంపీడీవో రామకృష్ణకి వైస్ ఎంపీపీ ఆనంద్, తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఆమనగల్లు : గ్రామ పంచాయతీలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ప్రభుత్వం ఆమనగల్లు మండలంలో 13 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆకుతోటపల్లి, సీతారాంనగర్ తండాకు మండల ఎంపీడీవో ఫారుక్ హుస్సేన్, మంగళపల్లి, చింతలపల్లి కి మండల తహసీల్దార్ లలిత, మేడిగడ్డ, శంకర్‌కొండతండాకు ఎంపీవో శ్రీలత, రాంనూతల, కోనాపూర్‌కు మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, పోలేపల్లి, కొత్తకుంట తండాకు ఐబీ ఏఈ బి, తిరుపతయ్య, సింగంపల్లి, చెన్నంపల్లికి పంచాయతీరాజ్ ఏఈ కృష్ణయ్య, శెట్టిపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శరత్‌లను ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

మొయినాబాద్‌లోని బాకారంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గౌతంకుమార్

మొయినాబాద్ మండలంలో

మొయినాబాద్ : మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సరిపడా గెజిటెడ్ స్థాయి అధికారులు లేకపోవడంతో కలెక్టర్ ఒక్కో అధికారికి రెండు గ్రామ పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించారు. శుక్రవారం అధికారులు బాధ్యతలను చేపట్టారు. చిలుకూరు, అప్పోజిగూడ గ్రామాలకు ఎంపీడీవో సంధ్య, కనకమామిడి, అజీజ్‌నగర్, బాకారం జాగీర్‌కు తహసీల్దార్ గౌతంకుమార్, తోలుకట్టా, ఎతుబార్‌పల్లి గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ ఎన్ వినోద్, హిమాయత్‌నగర్, ముర్తుజాగూడ గ్రామాలకు వ్యవసాయ అధికారి రాగమ్మ, చిన్నమంగళారం మేడిపల్లి గ్రామాలకు మండల విద్యాధికారి వెంకటయ్య, మొయినాబాద్, సురంగల్ గ్రామాలకు ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ద మంగళారం, ఎల్కగూడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఏ శివకుమార్, ఎన్కేపల్లి, నాగిరెడ్డిగూడ గ్రామాలకు పంచయతీరాజ్ శాఖ ఏఈ ఆశాజ్యోతి, కేతిరెడ్డిపల్లి, అప్పారెడ్డిగూడ గ్రామాలకు పశువైద్యాధికారి శ్రీలత, అమ్డాపూర్ కాశింబౌలి గ్రామాలకు పశువైద్యాధికారి దేవికారెడ్డి, వెంకటాపూర్, నక్కలపల్లి గ్రామాలకు పశువైద్యాధికారి ఎండీ హైమద్, కనకమామిడి, శ్రీరాంనగర్ గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ జి లక్ష్మి, రెడ్డిపల్లి, కుతుబుద్దీన్‌గూడ గ్రామాలకు పంచాయతీరాజ్ ఏఈ రమ్య, చందానగర్, మోత్కుపల్లి గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ ప్రియాంకలను నియమించారు.

ఇబ్రహీంపట్నంరూరల్ : గ్రామాల్లో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. శుక్రవారం వారు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమ్మ, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఎంపీవో లక్‌పతినాయక్, సీడీపీవో శాంతిశ్రీ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఫిబ్రవరి 2 : ఐదేండ్ల పాలనలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు చేసిన సేవలు అభినందనీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సర్పంచ్‌గా ఐదేండ్లు పూర్తి చేసుకున్న కడ్తాల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి శుక్రవారం మాజీ ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను ఆయన పూలమాల, శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో పదవీకాలం పూర్తి చేసుకున్న పంచాయతీ పాలకవర్గాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించారన్నారు. సమైక్యాంధ్ర పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన గ్రామా లు, తండాలను...బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందించిన సహకారంతో సర్పంచ్‌లు అన్ని రంగా ల్లో ముందుంచారన్నారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు, జాతీయ అవార్డులు లభించాయని గుర్తు చేశారు. అనంతరం పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, ఫిబ్రవరి 2 : సీఎం కేసీఆర్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాలను గెలిచాయని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని రంగంపల్లి, మొగిలిగిద్ద, ఎల్లంపల్లి, కందివనం, దేవునిపల్లి, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ, చించోడు, పీర్లగూడ, దొంతికుంట తండాల్లో ఆయన పర్యటించి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందాయని, ఊహించని రీతిలో నియోజకవర్గాభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ వారికి అండగా ఉండాలన్నారు. పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర మరువలేనిదన్నారు. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలన్నారు. ధైర్యంగా ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణ, హన్యానాయక్, లింగం, వీరేశం, గోపా ల్‌రెడ్డి, సూర్యప్రకాశ్, శివశంకర్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండాలి

యాచారం, ఫిబ్రవరి 2 : ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుకన్య మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేకాధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో ఉమారాణి ఉన్నారు.

అనేక మందికి జీవనోపాధి

ఉపాధిహామీ సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేస్తున్న పీడీ ప్రభాకర్

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 2 : కోట్లాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న పథకం జాతీయ ఉపాధిహామీ గ్రామీణ పథకం అని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద ఆయన కూలీలతో కలిసి ఆయన కేక్‌కట్ చేయించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ..లక్షలాదిమంది కూలీలకు ఉపాధిహామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సక్రియానాయక్, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 2 : సర్పంచుల కాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, డీఈ పరమేశ్వర్, ఏవో సురేశ్‌బాబు, ఉప తహసీల్దార్ ప్రియాంక, ఏఈ యుగంధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొయినాబాద్, ఫిబ్రవరి 2 : పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పెద్దమంగళారం, చిన్నషాపూర్ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అప్పారెడ్డిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

కుసుమ పంట పరిశీలన

కొత్తూరు, ఫిబ్రవరి 2 : మల్లాపూర్‌లో రైతులు సాగు చేసిన కుసుమ పంటను ఎన్‌జీ రంగా వ్యవ సాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. అఖిల భారత సమన్వయ కుసుమ పరిశోధన కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాపూర్‌లో 70 ఎకరాల్లో రైతులు కుసుమ పంటను వేశారు. రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనాస్థానం తాండూరు వారి సౌజన్యంతో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల వారు కుసుమ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ వానకాలంలో మొక్కజొన్న సాగు చేసిన పొలాలు రెండోపంటగా యాసంగిలో కుసుమకు అనుకూలంగా ఉంటాయన్నారు. అనం తరం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ కుసుమలో పేను తాకిడితో కలిగే నష్టం, సకాలంలో నివారణ చర్యలు ఎలా చేపట్టాలో వివరించారు. మల్లాపూర్‌లో వ్యవసాయ క్షేత్రాలను పరిశీ లించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రమేశ్, మండల వ్యవసాయ అధికారి డా. గోపాల్, ఏఈవో దీపిక , రైతులు మోహన్, మధు, పెంటారెడ్డి, రంగారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

అంబేద్కర్, పూలే అవార్డు గ్రహీత నారాయణదాస్

అంబేద్కర్, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నారాయణదాస్

షాబాద్, ఫిబ్రవరి 2: మహనీయుల ఆశయసాధనకు నిరంతరం కృషి చేస్తామని అంబేద్కర్, పూలే అవార్డు గ్రహీత కడమంచి నారాయణదాస్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ మాడల్ పాఠశాలలో అంబేద్కర్, సావిత్రీబాయిపూలే విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అడుగుజాడల్లో నడువాలని సూచించారు. సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మహనీయుల ఆశయసాధనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాచ్య, విద్యాకమిటీ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, గ్రామస్తులు జంగయ్య, కృష్ణ, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన అవసరం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మండల వెటర్నరీ అధికారి స్ఫూర్తి

కొత్తూరు, ఫిబ్రవరి 2: వీధి కుక్కలు, జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని మండల పశు వైద్యాధికారి డా. స్ఫూర్తి అన్నారు. కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల పశువైద్యాధికారి డా. స్ఫూర్తి ఆధ్వర్యంలో వీధి కుక్కలు, జంతువులతో ఎలా మెలగాలని అనే విషయంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతు సంక్షేమం, జంతు సంరక్షణ చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగిఉండాలని సూచించారు. అలాగే వీధి కుక్కలు కరువ కుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జంతు సంక్షేమం, అవగాహనపై ఎస్సే రైటింగ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంగూర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ నూతన ఎస్ఐగా వరప్రసాద్

కడ్తాల్, ఫిబ్రవరి 2 : కడ్తాల్ మండల నూతన ఎస్ఐగా వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన హరిశంకర్‌గౌడ్ సంగారెడ్డి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కేశంపేట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

ఎస్ఐలకు సన్మానం..

కడ్తాల్ మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వరప్రసాద్, బదిలీపై వెళ్తున్న ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌ను శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, లక్ష్మణ్‌నాయక్, లాయక్‌అలీ, కృష్ణ, ప్రభులింగం, జగన్, మోహన్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుల్లారెడ్డి నుంచి డబ్బులు రికవరీ చేయాలి

మంచాల, ఫిబ్రవరి 2 : సహకార సంఘం నూతన భవన నిర్మాణం పేరుతో అవినీతికి పాల్పడిన చైర్మన్ పుల్లారెడ్డిని సస్పెండ్ చేయడంతోపాటు డబ్బులను రికవరీ చేయాలని సహకార సంఘం డైరెక్టర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు డైరెక్టర్లు మాట్లాడుతూ 2020లో సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి రూ.35 లక్షల నిధులు కేటాయిస్తే అప్పటి చైర్మన్ పుల్లారెడ్డి ఎలాంటి తీర్మానాలు లేకుండా.. డైరెక్టర్లకు తెలియకుండానే వివిధ పనుల నిమిత్తం రూ.7లక్షల 20 వేల నిధులను డ్రా చేసి సొంతానికి వా డుకున్నందున జిల్లా స్థాయి అధికారులు అతడి నుంచి డబ్బులను రికవరీ చేయాలన్నారు. కార్యక్ర మంలో సహకార సంఘం డైరెక్టర్లు హనుమంత్‌రెడ్డి, వింజమూరి రాంరెడ్డి, జెనిగ వెంకటేశ్, సిరిప్రగడ వేణుగోపాల్‌రావు, రమేశ్, జనార్దన్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మల్లేశ్, రమాకాంత్‌రెడ్డి, శ్రీనునాయక్, శ్రీధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు, ఫిబ్రవరి 2 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్, రామస్వామి, నిరంజన్, మహేశ్, ఆచారి, క్రాంతికుమార్, వెంకటయ్య, రాంజి, లీలావతి, జ్యోతి, వరలక్ష్మి, వనిత, జయరాణి పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు
దరఖాస్తులు చేసుకోవాలి

దేవాదాయ, ధర్మదాయ శాఖ ఈవో శ్రీనివాస్

షాబాద్, ఫిబ్రవరి 2: షాబాద్ మండలంలోని వివిధ దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలని దేవాదాయ, ధర్మదాయ శాఖ ఈవో శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయం, అంతారం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాలకు సంబంధించి దేవాదాయ, ధర్మాదాయ శాఖ తెలంగాణ ప్రభుత్వంచే నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 19వ తేదీ వరకు తమ దరఖాస్తులను దేవాదాయశాఖ రంగారెడ్డిజిల్లా సహాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్‌లో అందజేయాలని కోరారు.

మాజీ సర్పంచులకు ఘన సన్మానం



సర్పంచులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పద్మారెడ్డి

నందిగామ, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలాభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ పార్టీ నందిగామ మండలాధ్యక్షుడు నోముల పద్మారెడ్డి అన్నారు. శుక్రవారం నందిగామ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నందిగామ మండలాధ్యక్షుడు నోముల పద్మారెడ్డి ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు జిల్లెల వెంకట్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, గోవింద్, అశోక్, కుమార్, నర్సింహులు, రాజూనాయక్, స్వామి, రాజనీతి వీరేందర్‌గౌడ్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, వార్డు సభ్యులకు ..

మంచాల : మంచాల మండలం లోయపల్లి మాజీ సర్పంచ్ ఎల్లంకి అనిత, ఉపసర్పంచ్ వెంకటేష్‌తో పాటు వార్డు సభ్యులను శుక్రవారం గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయం

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 2: ఫరూఖ్‌నగర్ మండలంలోని కిషన్‌నగర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలంయాదవ్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారి కరుణశ్రీకి స్వాగతం పలుకగా, కార్మికులను శుక్రవారం ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివరాజ్‌యాదవ్, వెంకటేశ్‌గౌడ్ మాజీ వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా
యాదయ్య

మంచాల, ఫిబ్రవరి 2: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బొద్రమోని యాదయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మంచాల సహకార సంఘం చైర్మన్‌గా ఉన్న పుల్లారెడ్డి సొసైటీ నిధులను దుర్వినియోగం చేశాడని అతడిని తొలగిస్తూ డీసీవో దాత్రిదేవి ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసమే పీఏసీఎస్ ఉందని, రైతులు నేరుగా పంటరుణాలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించనున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయ సంఘం
నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 : పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీని శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పట్నం కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వనమల్ల ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సాతిరి రాజిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మండలంలో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని జిల్లా శాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉద్యమకారుల
ఆత్మీయ సమ్మేళనం

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 2: తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు జనార్దన్, అర్జునప్ప, టీ.జీ శ్రీనివాస్, బాల్‌రాజు, కరుణాకర్, వెంకటయ్య, రాముతో పలువురు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటలకు నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.